క్లుప్తంగా

పట్టుకున్న రేషన్ బియ్యం ఇప్పించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంబుగామ గ్రామస్తులు

కుంటాల: భైంసా సమీపంలో పోలీసులు ఇటీవల పట్టుకున్న తమ రేషన్ బియ్యాన్ని ఇప్పించాలని మండలంలోని అంబుగామ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. తమ రేషన్ షాపు సూర్యాపూర్‌లో ఉండగా, అధికారుల సూచన మేరకు సదరు డీలర్ ప్రతినెల గ్రామానికి వచ్చి బియ్యం పంపిణీ చేస్తున్నాడని అన్నారు. ఈనెల12న భైంసా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ప్రైవేట్ వాహనంలో తీసుకువస్తుండగా 25 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వాపోయారు. అధికారులు స్పందించి బియ్యాన్ని వెంటనే తమకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు ఇందిరమ్మ ఇల్లు



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: మండలంలోని కల్లెడ గ్రామ మాజీ సర్పంచ్ డాకూరి లక్ష్మికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్ తెలిపారు. స్థానిక నాయకులు మహేశ్, దుర్గన్న, నాగరాజు, మల్లేశ్‌తో కలిసి సోమవారం పనులను ప్రారంభించారు. పక్కా ఇల్లు లేని మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంజూరు చేయడం హర్షణీయమన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని చింతల్‌బోరి గ్రామానికి చెందిన బోస్లే అవసాజీ (26) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అవసాజీ గత కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఎప్పటిలాగే సోమవారం పశువులు మేపడానికి వెళ్లాడు. గ్రామశివారులో వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసున్నారు.

పరామర్శ

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ మాజీ సర్పంచ్ సొదాని శ్రీకాంత్ యాదవ్ తండ్రి ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ సోమవారం పరామర్శించారు. నాయకులు రంజిత్, శ్యాం, శ్రావణ్ ఉన్నారు.

సారంగపూర్: మండల కేంద్రానికి చెందిన ఓలాత్రి నారాయణరెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన ఇంటికి వెళ్లిన శ్రీహరిరావు బాధిత కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకుని ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన దాసరి లక్ష్మినారాయణ, లింగయ్యల తల్లి పోసవ్వ మృతి చెందగా ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్‌హాదీ, పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, గ్రామస్తులు ఉన్నారు.

కళాశాలలో నీటి సౌకర్యం కల్పించాలి

తానూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక పాతబడిన బీసీ వసతిగృహంలో కొనసాగుతోంది. సౌకర్యాల్లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. నీటి వసతి లేక ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారడంతో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా తాగునీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో నీటి సమస్య పరిష్కరించాలని ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు సోమవారం ఎంపీడీవో నసిరొద్దీన్, తహసీల్దార్ లింగంమూర్తిని కలిసి విన్నవించారు. స్పందించిన ఎంపీడీవో.. మిషన్ భగీరథ నీటిని సరఫరా అందించి సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీఇచ్చారు.

ల్యాప్‌టాప్ అప్పగింత

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ బస్సులో మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి ప్రయాణికుడికి అప్పగించి కండక్టర్ నిజాయతీ చాటుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులో బోథ్ బ్యాంకు ఉద్యోగి గంగాప్రసాద్ ల్యాప్‌టాప్ మర్చిపోయి మార్గమధ్యలో పోచంపాడ్‌లో దిగాడు. కొద్దిసేపటికి ల్యాప్ టాప్ మర్చిపోయిన విషయం గమనించి, టికెట్‌పై ఉన్న కండక్టర్ నెంబర్ ఆధారంగా ఫోన్ చేశారు. కండక్టర్ వాజీద్ నిజామాబాద్ విజిలెన్స్ సమక్షంలో గంగాప్రసాద్‌కు ల్యాప్‌టాప్ అప్పగించాడు. నిజాయతీ చాటుకున్న కండక్టర్‌ను డిపో మేనేజర్ పండరీ అభినందించారు.

ఆశలకు గౌరవ వేతనం ఏది?

- శ్రమకు తగిన గుర్తింపు లేదని ఆవేదన
- ఎన్నోరకాల బాధ్యతలు
- సెలవు దినాల్లో సైతం విధులు



లోకేశ్వరం పీహెచ్‌సీలో గర్భిణులతో ఆశవర్కర్లు

లోకేశ్వరం: ఆశవర్కర్ల శ్రమకు తగ్గ వేతనం అందడం లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు నియమించిన ఆశవర్కర్లను ఆ సేవలకే పరిమితం చేయకుండా ప్రభుత్వం వివిధ రకాల పనుల కోసం వినియోగించుకుంటోంది. ముఖ్యంగా, కరోనా పరీక్షలు, వ్యాక్సినేషన్, ఇంటింటి ఆరోగ్య సర్వే ఇలా ఎన్నో రకాలైన బాధ్యతలను అప్పగిస్తోంది. సెలవు దినాల్లో శక్తి వంచన లేకుండా వారు పని చేస్తున్నారు. జిల్లాలో 569 మంది ఆశవర్కర్లు పని చేస్తుండగా వారికి నెలకు ప్రభుత్వం రూ.7500 గౌరవ వేతనం ప్రకటించింది. లక్ష్యానికి అనుగుణంగా సేవలందించని వారికి రూ.7200ల వేతనం చెల్లిస్తోంది. ఆరోగ్య కార్యకర్తలతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా గుర్తింపు లేకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించిన సమయంలో అంగన్‌వాడీ, ఆశవర్కర్లకు కూడా 30 శాతం వేతనం పెంచనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా ఆశవర్కర్లకు రూ.9750 చొప్పున గౌరవ వేతనం చెల్లించాలని నిర్ణయించారు. ప్రస్తుతం చేస్తున్న పనికి పెంచాలనుకున్నా వేతనం ఎంత మాత్రం సరిపోదని వారు చెబుతున్నారు. అదేవిధంగా వేతనాలను ట్రెజరీ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రెజరీ ద్వారా అయితే నెలనెలా క్రమం తప్పకుండా వేతనాలు అందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నందున వల్ల మూడు, నాలుగు నెలలకోసారి వేతనం చెల్లిస్తుండటంతో కుటుంబం గడవడం కష్టంగా ఉందని ఆశవర్కర్లు పేర్కొంటున్నారు.

కనీస వేతనం చెల్లించాలి



శ్రమకు తగ్గ వేతనం చెల్లిచడం లేదు. ఎక్కువ పని చేయించుకుని తక్కువ వేతనం ఇస్తున్నారు. కనీస వేతనం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నందకుమారి, మండల ఆశవర్కర్ల సంఘం అధ్యక్షురాలు

హనుమాన్ విగ్రహానికి వెండి కిరీటం



వెండి కిరీటాన్ని అందజేస్తున్న కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దత్తాత్రేయ కాలనీలో పంచముఖ హనుమాన్ విగ్రహ అలంకరణ కోసం ప్రముఖ కాంట్రాక్టర్ లక్కడి జగన్మోహన్ రెడ్డి సోదరులు వెండి కిరీటాన్ని, వెండి ధోవతిని అందజేశారు. పూజారి చంద్రశేఖర్ వర్మ చేతుల మీదుగా సోమవారం హనుమాన్ విగ్రహానికి అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సభ్యులు వెంకట్‌రెడ్డి, నర్సారెడ్డి, గంగారెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనగర్ తండావాసులు

లోకేశ్వరం: నక్కల కులం పేరుతో తమకు ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని మండలంలోని లక్ష్మీనగర్ తండావాసులు సోమవారం తహసీల్దార్ సర్పరాజ్ అమ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా తండావాసులది నక్కల కులమని, ఎస్టీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా పార్ధి కులం పేరున బీసీ ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని మెదక్‌లో మా కుల బంధువులకు నక్కల కులంతో ఎస్టీ సర్టిఫికెట్ ఇస్తున్నారని తమకు అలాగే ఇవ్వాలని కోరారు.

మంద పోచమ్మ పండుగ

బాసర: మండలకేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో మంద పోచమ్మ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. పోచమ్మ, ముత్యాలమ్మ, దుర్గమ్మ అమ్మవార్లతోపాటు ఎల్లమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు దేవుని ప్రతిమలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు.

యువత మత్తుకు బానిసకావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత స్థాయిలకు చేరాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ పేర్కొన్నారు. నషా ముక్త్‌భారత్ అభియాన్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని ఈద్గాం ప్రభుత్వ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. యువత మత్తుకు బానిస కాకుండా ఉన్నతంగా చదవాలన్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సీడీపీవోలు నాగమణి, సరిత, ఏసీఎంవో శివా జీ, హెచ్‌ఎం తుకారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

నిర్మల్‌టౌన్: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు, గంజాయి, వివిధ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ వాడకంపై సోమవారం అవగాహన కల్పించారు. సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేసి ఫొటోలు దిగారు. అనంతరం మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా యాంటీ డ్రగ్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొంతమంది యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలు అమ్ముతూ.. బానిసలుగా మారుస్తూ భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సరఫరా చేసినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, దీక్ష కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఉపాధ్యాయులు

ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై ఆరోపణలు సహించం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై ప్రజలను రెచ్చగొట్టేలా నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. స్థలం సమస్య కారణంగా తొలివిడతలోనే రావల్సిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల రెండో విడతలో నియోజకవర్గానికి తీసుకువచ్చామని తెలిపారు. ఖానాపూర్, పెంబిలో స్థలం లేక కడెంలో ఇరిగేషన్ భూములు, దస్తురాబాద్‌లో అటవీశాఖ భూములు ఉండడంతోనే ఉట్నూర్‌లో ఏర్పాటుచేస్తున్నామని అన్నారు. ఖానాపూర్‌లో దశాబ్దాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పట్టణంలో 110 ఎకరాల స్థలం లేదని, కేవలం 76 ఎకరాలు మాత్రమే ఉందని అది కూడా గతంలో పలు శాఖలు, సంఘాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం కేటాయించారన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు శాంతినగర్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు భూషన్, మాజిద్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, రమేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్లు చిన్నం సత్యం, రాజేందర్, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగాభవాని, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఎంపీకి వినతి

పట్టణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై సోమవారం ఎంపీ నగేశ్‌కు ఇంటిగ్రేటెడ్ స్కూల్ సాధన సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో సోమవారం జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎంపీని కలిసి విన్నవించారు. నంది రామయ్య, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్, బీసీ రాజన్న, గంగారావు, ప్రణయ్, నారాయణ ఉన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి



సారంగాపూర్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



బాసరలో..



సోన్‌లో..

కుంటాల/బాసర/భైంసాటౌన్/మామడ/సోన్/ముధోల్/సారంగపూర్/నర్సాపూర్(జి): దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడిన జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి బలిదాన్ దివస్ పురస్కరించుకొని సోమవారం ఆయన చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుంటాల మండలం కల్లూరులో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలవేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. పార్టీ కన్వీనర్ పసుల నవీన్, శక్తికేంద్ర ఇన్‌చార్జి రజనీకాంత్, బూత్ అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- భైంసా బీజేపీ కార్యాలయంలో బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డా శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రావుల రాము, అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, నాయకులు పోశెట్టి, గాలి రవి, దిలీప్, శ్రీకాంత్, సాయినాథ్, వద్నప్ శ్రీనివాస్, మన్మోహన్ పటేల్ ఉన్నారు.
- బాసర, మామడ, సోన్, ముధోల్, సారంగపూర్, నర్సాపూర్(జి)లో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు సాయినాథ్ పటేల్, రంజిత్‌కుమార్, నరేందర్‌రెడ్డి, లక్ష్మి, ఆశన్న, నరేశ్, రాజేశ్వర్, మార గంగారెడ్డి, నరేశ్, నవీన్, బోనగిరి గంగయ్య, గంగాధర్, రమేశ్, లడ్డు పోతన్న, మోహన్‌యాదవ్, నరేశ్, వీరయ్య, బర్కుంట నరేందర్, రాజేందర్, దత్తురాం, రాజు, మహేశ్, విజయ్, రాము, పవన్ పాల్గొన్నారు.

అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

- ఎంపీ నగేశ్



ఉడుంపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఖానాపూర్/కడెం/దస్తురాబాద్: మోదీ పాలన స్వర్ణయుగమని, బీజేపీ పాలనలోనే దేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఖనాపూర్ మండలం దిలావర్‌పూర్, కడెం మండలం ఉడుంపూర్, దస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామంలో నిర్వహించిన బీజేపీ రచ్చబండ కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. 11 ఏళ్ల బీజేపీ పాలనలో భారత్ ఆర్థికంగా 11వ స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎదిగిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాకర్షణ పథకాలతో అన్నివర్గాలకు దగ్గరైందని, గ్రామీణ, పట్టణ అభివృద్ధికి నిధులు కేంద్రమే అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మోదీ చిత్రం ఉపయోగించకుండా కాంగ్రెస్ పేరుతో ప్రచారం చేయడం సరికాదన్నారు. ఆరు కిలోల సన్న బియ్యంలో ఐదు కిలోలు కేంద్రమే ఇస్తోందని తెలిపారు. ఎనగందుల నారాయణ, రాపెల్లి రవీందర్, కొండేరి సాయి ఆధ్వర్యంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు.

బలిదాన్ దివస్..

దిలావర్‌పూర్ ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా శ్యామాప్రసాద్‌ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. దస్తురాబాద్ మండలం గోడిసిర్యాల రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, నాయకులు ఆకుల శ్రీనివాస్, అంకం మహేందర్, పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, సి. భూమన్నగౌడ్, కామోజీ కిషన్, రాసమల్ల పెద నర్సయ్య, గోనె శ్రీనివాస్, ఓరగంటి నర్సయ్య, కె.నారాయణ, లక్ష్మీపతి, తోకల బుచ్చన్న, బొప్పారపు సత్యవతి, రవీందర్, లింబాద్రి, రమేష్, అనిల్‌రావు, శ్రీనివాస్, కడెం మండల అధ్యక్షుడు కాశవేనిశ్రీనివాస్‌యాదవ్, సత్తెన్న, శ్రీరాం, రాపర్తి శ్రీనివాస్, తిరుమల్, నల్లగొండ, లక్ష్మణ్, తిరుపతి, దస్తురాబాద్ మండల అధ్యక్షుడు పానుగంటి రాజు, నాయకులు లక్ష్మణ్, హన్మగౌడ్, వెంకటరమణ, వెంకటేశ్, కళ్యాణ్, రాజేందర్, గంగాధర్, రాజగౌడ్, సత్యంగౌడ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్‌ను అడ్డుకుంటున్నారని ఆందోళన

లక్ష్మణచాంద: మండలంలోని పీచర సబ్‌స్టేషన్ నుంచి ధర్మారం గ్రామానికి నూతనంగా సింగిల్ ఫేజ్ విద్యుత్ లైన్‌ను అడ్డుకుంటున్నారని గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా కోసం స్తంభాలతోపాటు విద్యుత్ తీగలు వేశారు. పీచర సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయొద్దని అక్కడి గ్రామస్తులు తీగలను తీసివేయించారని వారు ఆరోపించారు. ఎందుకు తీశారని అడుగగా సబ్‌స్టేషన్ స్థలానికి తాము డబ్బులు వెచ్చించామని పీచర గ్రామస్తులు చెప్పారు. తమకు డబ్బులిస్తేనే లైన్ వేయనిస్తామని పీచర వీడీసీ సభ్యులు అడ్డుకుంటున్నారని సోమవారం ధర్మారం గ్రామస్తులు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో ఏఈ మహేశ్‌ను కలిసి నిరసన తెలిపారు. తర్వాత నిర్మల్‌కు వెళ్లి విద్యుత్ డీఈ నాగరాజుకు, అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్‌ను కలిసి ధర్మారం వీడీసీ సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. అడిషనల్ కలెక్టర్ స్పందించి ఏఈని పంపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు.

గ్రామదేవతలకు పూజలు

కుంటాల: మండలంలో విఠాపూర్‌లో వర్షం కురవాలని గ్రామస్తులు సోమవారం గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. రైతులు నెత్తిన గోదావరి నదీ జలాలు తీసుకువచ్చి గ్రామ దేవతలకు అభిషేకించారు. అనంతరం వారు ఒకచోట చేరి సహపంక్తి భోజనాలు చేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



భైంసాలో మొక్క నాటుతున్న రాజేశ్‌కుమార్

భైంసాటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ అన్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం పట్టణంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్డి(బి) బైపాస్ చౌరస్తా వద్ద మొక్కలు నాటారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్, మెప్మా, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలో ఎస్సై సాయికిరణ్, ఎంపీవో తిరుపతిరెడ్డి మొక్కలు నాటి నీటిని పోశారు.

తానూరు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో నసిరొద్దీన్ మొక్కలు నాటారు. ఈజీఎస్ ఏపీవో శివలింగయ్య, గ్రామస్తులు ఉన్నారు.

ముధోల్: కేజీబీవీ ఆవరణలో ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

కుంటాల: ఆదర్శ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపల్ కాసు నవీన్ కుమార్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

లక్ష్మణచాంద: రాచాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ రాజు విద్యార్థులతో కలిసి 50 మొక్కలు నాటారు.

సంక్షిప్తంగా

యాంటీ డ్రగ్స్‌పై అవగాహన

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ ట్రైనర్ రాజశేఖర్, హెచ్‌ఎం నరేందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. స్వర్ణ ఆశ్రమ పాఠశాలలో మత్తు పదార్థాల నివారణ వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల, పోలీసుల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ఖానాపూర్: ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని యంగ్ స్టార్ యూత్ అధ్యక్ష, కార్యదర్శులు షకీల్, అల్తాజ్ కోరారు. జిల్లాకేంద్రంలోని ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు విద్యాశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యేలా చూడాలని విన్నవించారు.

కళాశాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దాం

కుంటాల: కళాశాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని ప్రిన్సిపాల్ తుకారాం పేర్కొన్నారు. కుంటాల జూనియర్ కళాశాలలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామస్తులు, కమిటీ సభ్యుల సహకారంతో 4 గ్రూప్‌ల్లో సుమారు 100 మంది విద్యార్థులు చేరారని అన్నారు. మూడు గదుల్లో తరగతులు కొనసాగుతున్నాయని, మరో మూడు గదులు అవసరమని గుర్తించారు. సీడీసీ అధ్యక్షుడు నవీన్‌కుమార్, సభ్యులు, అధ్యాపకులు ఉన్నారు.

బడుల పర్యవేక్షణ స్వాగతిస్తున్నాం

నిర్మల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బడుల పర్యవేక్షణ కోసం ఉపాధ్యాయులను నియమించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల లోటుపాట్లు ఉపాధ్యాయులకే తెలుసన్న సదుద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. ప్రావీణ్యత కలిగిన ఉపాధ్యాయులను గుర్తించి ఒక ప్రత్యేక పరీక్ష ద్వారా వారిని ఎంపిక చేయాలన్నారు. నాయకులు క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పర్యవేక్షణ బాధ్యతలు సరికాదు

తానూరు: ప్రభుత్వ పాఠశాలల పనితీరును పర్యవేక్షించాడానికి టీచర్లనే తనిఖీ అధికారులుగా నియమిస్తూ విద్యాశాఖ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో విద్యా ప్రమాణాలకు చర్యలు తీసుకుంటామని చెబుతూనే, ఉపాధ్యాయులను పాఠశాలల నుంచి దూరం చేయడం తగదన్నారు. అనాలోచిత నిర్ణయాలను విరమించుకోవాలని సూచించారు. 2 వేల మంది టీచర్లు పాఠశాలకు దూరమైతే విద్యప్రమాణాలు పడిపోతాయని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌చైన్‌గేట్: టౌన్–2 పరిధిలోని నటరాజ్‌నగర్ ప్రాంతంలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. చైన్‌గేట్, మార్కెట్ ఏరియా, ఇంద్రానగర్, గొల్లపేట్, శాస్త్రీనగర్, మంచిర్యాల చౌరస్తా, నటరాజ్‌నగర్, బొయవాడ, భాగ్యనగర్ మదీన కాలనీ ఏరియాల్లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విద్యార్థినికి సన్మానం

కుంటాల: పెంచికల్‌పాడ్‌కు చెందిన దొంతుల వర్షిణి నిర్మల్ సోఫీనగర్ గురుకుల పాఠశాలలో చదివి ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, టీచర్లు విద్యార్థిని సన్మానించారు. హెచ్‌ఎంలు ఫణిందర్, ఎల్లన్న, గ్రామపెద్దలు న్నారు.